

ఎంఎల్‌టి క్లాసులకు అనుమతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంఎల్‌టి క్లాసుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని ప్రిన్సిపల్ డాక్టర్ కెఎస్ఎస్.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌టి వంటి పారామెడికల్ చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సంవత్సరం బైపిసి, ఎంపిసి, సిఇసి, హెచ్ఇసి, ఎంపిహెచ్‌డబ్ల్యులతో పాటు ఎంఎల్‌టి కోర్సుల్లో ప్రవేశానికి కళాశాల పని దినాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.


ప్రిన్సిపల్ రాజశేఖర్

అరకొర వేతనాలే దిక్కు

- ఉపాధి పనిలో రూ.250 రాని కూలి
- కల్పించని 200 రోజుల పని దినాలు
- పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు
- రూ.600 చెల్లించాలంటున్న కార్మికులు


పనులు చేస్తున్న ఉపాధి కూలీలు(ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు అక్కరకు రాకుండా పోతుందా..? గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన ఈ చట్టం క్రమంగా నిర్వీర్యం అయిపోతుందా.. అంటే అవుననే సమాధానాలే విన్పిస్తున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలో శ్రమిస్తున్నా కేవలం రూ.250 మించి కూలీ రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు విధానాల పుణ్యమా అని నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు వలన ప్రజలపై భారాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. విద్యుత్, రవాణా ఛార్జీల భారం పెరిగిపోతోంది. పన్నులు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సాధారణ కుటుంబాలు జీవనం సాగించడానికి ధీన స్థితిని అనుభవించాల్సి వస్తుంది. రోజుకి రూ.వెయ్యి ఉంటేనే గాని ఒక సామాన్య కుటుంబం జీవనం కష్టంగా మారిపోయింది. అటువంటి పరిస్థితుల్లో వ్యవసాయ కార్మికులకు రోజూ వారి వేతనం రూ.250 మించి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

పెంపు అరకొరే

జిల్లాలో 21 మండలాల్లో 3.42 లక్షల జాబ్ కార్డులుండగా 4,59,414 వేతనదారులు ప్రతీ రోజు పనులకు వెళుతున్నారు. ఈ వేసవిలో సుమారు 60 వేల మంది వేతనదారులు పనులకు వెళుతున్నారు. అయితే రోజురోజుకూ పెరుగుతున్న నిత్యవసరాల ధరలతో పోల్చుకుంటే వేతనాలు సరిపోని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం గతంలో రూ.257 గరిష్ట వేతనం ఇచ్చేవారు. దానికి రెండేళ్ల క్రితం రూ.272కి పెంచారు. గతేడాది రూ.300కి మాత్రమే పెంచి చేతులు దులుపుకున్నారు. అయితే సాధారణ రోజుల్లో పొద్దస్తమానూ, వేసవిలో మండుటెండలో పని చేస్తుంటే రూ.200 నుంచి 250 మించి వేతనం అందడం లేదని వ్యవసాయ కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.600కి పెంచితేనే...

ప్రభుత్వం కనీస వేతనంగా రూ. 600 చెల్లించే విధంగా చట్టంలో మార్పులు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం అరకొర వేతనం మాత్రమే అందుతుండడం వల్ల కుటుంబ పోషణ కష్టంగా మారిందని వ్యవసాయ కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు వేతనం పెంచాలని అధికారులకు, పాలకులకు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు. వంటగ్యాస్ సహా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదలతో పాటు ఇంట్లో నిత్యం వాడుకునే బియ్యం, నూనెలు, పప్పులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం మాత్రమే ఇస్తున్నారు. గతంలో అరకిలో పంచదార, కిలో కందిపప్పు ఇచ్చేవారు. ప్రస్తుతం అవి ఇవ్వడం లేదు. బహిరంగ మార్కెట్లలో నిత్యవసరాలను కొనుగోలు చేయాలంటే సామాన్యులకు ఆర్థిక భారం తప్పడం లేదు. క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గరిష్ట కూలి కూడా వేల మంది కూలిలకు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది. రెండేళ్ల క్రితం సగటు కూలి రూ.234.50 దాటలేదు. అంతక ముందు సంవత్సరం రూ.225.17 దాటలేదు. అయితే అధికారులు మాత్రం రూ.250 తగ్గకుండా వేతనం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆచరణ సాధ్యం కావడం లేదు. గత ఐదేళ్లలో రూ.235 వేతనం దాటిన సందర్భం కనిపించలేదు. ఈ నేపథ్యంలో గరిష్ట వేతనం రూ.600 ఇవ్వాలనే డిమాండ్ వ్యవసాయ కార్మికుల నుంచి వినిపిస్తుంది. అలాగే ఏడాదిలో 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరుతున్నారు.



కష్టంగా కుటుంబ పోషణ

ఉపాధి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. కనీస కూలి రూ.250 మించి రావడం లేదు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

-గొర్రెల సూర్యనారాయణ, ఉపాధి కూలీ, గండేపల్లి



వేతనాన్ని రూ.600కు పెంచాలి

గరిష్ట వేతనాన్ని కనీసంగానైనా ప్రభుత్వం రూ.600కు పెంచితేనే గాని ఇబ్బందులు తగ్గేలా కనిపించడం లేదు. ఎండల్లో పని చేస్తుంటే అనేక అవస్థలు పడుతున్నాం. అయినా కూలి గిట్టుబాటు కావడం లేదు.

-శనిపోయిన ప్రభువులు, ఎపి మల్లవరం, గొల్లప్రోలు



అందరికీ పనులు కల్పించాలి

గ్రామాల్లో ఎక్కువ శాతం వ్యవసాయ పనులను రైతులు యంత్రాల ద్వారా చేపడుతున్నారు. నానాటికీ పనులు తగ్గిపోతున్నాయి. ఇప్పుడిస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదు. ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.

ములికి నూకరత్నం, ఉపాధి కూలీ, గొల్లప్రోలు

నేటి నుంచే డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(డిఎస్‌సి-2025) పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ఈనెల 30 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. రోజూ రెండు విడతలుగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు సాగుతాయి. అన్ని కేంద్రాల్లోనూ పేపర్ల వారీగా మొత్తం 41,017 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇప్పటికే హాల్ టికెట్లు అందుబాటులో ఉంచారు.

ఏర్పాట్లు పూర్తి

పరీక్షల నిర్వహణలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని కేంద్రాల్లోనూ ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. డివైఇఒలు కేంద్రాలను పరిశీలించారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి గురువారం సంబంధిత పరీక్షా కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లుపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద పగడ్బందీగా పోలీసు బందోబస్తు ఉంటుందని అధికారులు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్, గుర్తింపుకార్డుతో పాటు గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షల కేంద్రాల పూర్తి వివరాలు జిల్లా డిఇఒ వెబ్ సైట్‌లో ఉంచారు. ఆయా సెంటర్లలో వికలాంగులకు సంబంధించి 87 మంది స్క్రయిబ్‌లను నియమిం చడం జరిగింది. హాల్ టికెట్లలో పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు తదితరాల్లో ఏవైనా తప్పులుంటే అభ్యర్థులు వారి ఒరిజనల్ పదో తరగతి మార్కుల జాబితా, ఇతర సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లను పరీక్ష కేంద్రాల్లో ఉండే డిపార్ట్‌మెంట్ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

పరీక్ష కేంద్రాలివే...

పెద్దాపురం డివిజన్ పరిధిలో నాలుగు, కాకినాడ డివిజన్ పరిధిలో రెండు, మొత్తం ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ అచ్చుతాపురం గేటు వద్ద అయాన్ డిజి టల్ జోన్, రాయుడు పాలెం కూడలి వద్ద సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్యనగర్, ఎడిబి రోడ్డులో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల్లో జరగనున్నాయి.

సమాచారం కోసం

పరీక్ష కేంద్రాల సమాచారం కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఎస్‌సి సమాచారా కేంద్రాన్ని సంప్రదించాలని డిఇఒ రమేష్ తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్: 9492515116, సూపరింటెండెంట్: 7799698462, సీనియర్ అసిస్టెంట్: 7989750963 లను సంప్రదించవచ్చునని తెలిపారు.

పని గంటల పెంపుపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మిక సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును మన రాష్ట్రంలో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనికోసం పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమని, కార్మికుల రక్త మాంసాలు పిండి కార్పొరేట్‌లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని అయన విమర్శించారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరుగుతున్న కాలంలో ఎఐ విస్తరించి మానవ శ్రమను తగ్గిస్తున్న ఆధునిక యుగంలో కూడా పనిగంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణమని అయన అన్నారు. కనీస వేతనాలు పెంచడానికి ప్రభుత్వం సిద్ధపడలేదని, ఒకవైపు ధరలు పెరిగి శ్రామికుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని, కొనుగోలు శక్తి తగ్గిందని అయన అన్నారు. ఈ స్థితిలో పనిగంటలు తగ్గించి అదనపు ఉపాధిని కల్పించాల్సిందిపోయి నిరుద్యోగాన్ని పెంచే ఈ చర్య అభివృద్ధి నిరోధకమైందని, తక్షణం లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని అయన డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా జూలై 9న జరగనున్న జాతీయ సమ్మెకు సిపిఎం పూర్తి మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. యావత్ కార్మికవర్గం ఐక్యంగా ఈ దాడిని ప్రతిఘటించాలని కరణం ప్రసాదరావు పిలుపునిచ్చారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, పారిశుధ్య సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సిపిఎం నాయకులు కోరారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని సిపిఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు నీలపాల సూరిబాబు, మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు గోదావరి నుంచి తాగునీటిని అందించేందుకు 1963లో మంచినీటి పథకాన్ని ప్రారంభించారని అన్నారు. అయినా నేటికీ అనేక ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. పట్టణ పరిధిలోని పెద్ద డ్రెయిన్‌లన్నీ పూడుకుపోవటంతో వర్షం కురిసిన సమయంలో ప్రవాహం లేక పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి అభివృద్ధి కోసం రూ.37 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, యాసలపు రమేష్, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా 1.50 లక్షల మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి వెల్లడించారు. పలు కేంద్రాల్లో జరిగిన మొక్కల నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొని మొక్కల నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ నగరంలోని రంగరాయ వైద్య కళాశాలలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి బిందుమాధవ్, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.రవీంద్రనాథ్ రెడ్డి, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణవర్ధన్, ఇతర అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆర్ఎంసి ఆడిటోరియంలో అనపర్తి మండలం రామవరం జడ్‌పి హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ మందపల్లి సత్యానందం, పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన వాటర్ పెయింటింగ్ చిత్రాలను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమామహేశ్వర రావు, ఐఎంఎ అధ్యక్షుడు ఎం.పవన్‌కుమార్, కార్యదర్శి సిహెచ్.కిరణ్ కుమార్, రెడ్ క్రాస్ కార్యదర్శి శివకుమార్, ఆల్ ఇజ్ వెల్ సంస్థ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, అటవిశాఖ అధికారులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక సత్యవేణి పేటలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మొక్కల నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పరిమి బాబు, ఎంపిడిఒ చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి సూర్యభాస్కర్, ఎపిఒ రమణకుమార్, పంచాయితీ కార్యదర్శి జి.శివప్రసాద్ పాల్గొన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రఘునాథరావు మొక్కలు నాటారు. **పెద్దాపురం** పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పర్యావరణ పరిరక్షణపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ ఆవరణలో విద్యార్థులచే మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లయ్య పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎంపిపి గొల్లపల్లి బుజ్జి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ధ సూర్యప్రకాష్‌రావు, ఎంపిటిసి బుద్ధ ఈశ్వరరావు, ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ, ఎపిఒ సత్యనారాయణ ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మండలంలోని తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో గ్రామ కార్యదర్శి జోగా రవణమ్మ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సిహెచ్.అజయ్‌కుమార్, జోగా అప్పారావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **శంఖవరం** అన్నవరం దేవస్థానం వేద పాఠశాల, కొండ దిగువన హైస్కూల్లోనూ స్వామివారి వెతికి పూజలకు అవసరమయ్యే ఔషధ మొక్కలను ఇఒ సుబ్బారావు నాటారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **కాజులూరు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జె.రాంబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాత భారతి, మాజీ ఎంపిపి యాళ్ల కృష్ణారావు, టిడిపి మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానికంగా పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వార్డు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకష్ణ, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఉన్నారు. **పెద్దాపురం** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూటమి పార్టీల నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో రాజా సూరిబాబు, ముప్పన వీర్రాజు, కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీలలిత, తదితరులు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని బలరాంపురం సర్పంచ్ పైల సీత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పైల నాయుడు, యాగదాసు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు పాల్గొన్నారు. **సామర్లకోట** మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.స్వప్న, ఎపిఒ గంగాభవాని, నగర పంచాయతీ మేనేజర్ నవీన్‌చంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గండేపల్లి** ఆదిత్య యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్. ఛాన్స్‌లర్లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, ఫార్మసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విలాస్‌అనిల్‌చవాన్, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ డి.కిషోర్, డాక్టర్ ఎంవి.రాజేష్, ఎన్ఎస్-ఎస్ పిఒలు బి.రాంబాబు, ఐవి.వీరాంజనేయులు, ఎల్. పరిణయశ్రీ, ప్రశాంతి, ఎ.శృతి, వేదప్రియ, వైదేహి, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, ఇంజనీరింగ్,మరియు ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. **కరప** కరప, గొడ్డటిపాలెం గ్రామాల్లో ఎంపిడిఒ అనుపమ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు అనూష, సాది ఆశాజ్యోతి, కార్యదర్శి నిర్మలాదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు. **పిఠాపురం** సీనియర్ సివిల్ జడ్జ్ ఎం.బాబు ఆధ్వర్యంలో కోర్టులో మొక్కలు నాటారు. మెయిన్ రోడ్డులో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌తో కలిసి విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా మొక్కలు నాటారు. పాడా కార్యాలయంలో పీడీ చైత్రవర్షిణి మొక్కలు నాటారు.


అన్నవరం దేవస్థానంలో మొక్కలు నాటుతున్న ఇఒ సుబ్బారావు



జగ్గంపేటలో మొక్కను నాటుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు నవీన్


గండేపల్లి మండలం ఆదిత్యలో మొక్కకు నీళ్లు పోస్తున్న రమాశ్రీ



కాకినాడలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

కార్టూ'నిజం'



ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - తొండంగి


ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్.శ్రీనివాస్

ఉపాధి హామి చట్టం ద్వారా చేసిన పనులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు గురువారం మండలంలోని తొండంగి, సీతారాంపురం, శృంగవృక్షం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల ప్రాంతాలను ఆయన సందర్శించారు. పని ప్రాంతంలో కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ 10 వారాలుగా చేసిన పనికి కూలి డబ్బులు చెల్లించలేదని, పని ప్రాంతంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయనకు వివరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి పథకాన్ని ఎత్తి వేస్తామని అంటున్నారని, గ్రామాల్లో ఉన్న పెత్తందారులు అదేమాట అంటున్నా రని అన్నారు. ఎట్టి పరిస్థితిలో ఈ పథకం రద్దు కాకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు. ఈ పథకాన్ని కాపాడు కుంటేనే కార్మికులకు ఎంతో కొంత మేలు జరుగుతుందని తెలిపారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200రోజులు పెంచాలని, కూలి రేటును రూ.600పెంచాలని, గతంలో మాదిరిగా పే స్లిప్‌ను ఇవ్వాలని, కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో టెండ్లు వేయడంతోపాటు, పనికి ఉపయో గించే గునపం, పార వంటి పని ముట్లను ప్రభుత్వ మే అందించాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం, సిఐటియు మండల నాయకురాలు కామేశ్వరి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


మహిళకు చీరను పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

లయన్స్ ఆధ్వర్యాన చీరల పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గురువారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌విబిఎస్ఎస్.ప్రసాద్ ఏలేశ్వరం క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు కొనియాడారు. స్థానిక క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ ప్రతి సభ్యుడు సేవే మార్గంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల సేవలో ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడివి.ప్రసాద్, ఊర రాజబాబు, కప్పల నాగభూషణం, జ్యోతుల నాగ సత్యశ్రీనివాస్, గొల్లపూడి గణేష్, తాండూరు రాము పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

సామర్లకోట మండలంలో ని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ను అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జిల్లా నోడల్ అధికారి బి.ప్రతాప్‌రెడ్డి గురువారం పరిశీలిం చారు. మండల స్టాక్ పాయింట్ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కిట్లు సరఫరా అయ్యాయా లేదా అన్న అంశంపై సమగ్ర పరిశీలన చేశారు. 75 పాఠశాలలకు చెందిన 7729 మంది విద్యార్థులకు బెల్టులు 5021, పాఠ్యపుస్తకాలు 38844, ఆరో తరగతికి 962 డిక్షనరీలు, నోట్ పుస్తకాలు 56306 రాగా వాటి సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు సరఫరా చేసినట్లు ఎంఇఒ-2 పుల్లయ్య ఆయనకు వివరించారు. సరఫరా తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పెద్దాపురం మున్సిపాలిటీలోని రాజీవ్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను బి.ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ వైఆర్‌కె.చౌదరి స్టాక్ వివరాలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ చామంతి నాగేశ్వరరావు, ఎఎస్ఒ జోగిరెడ్డి, కార్యాలయ సిబ్బది, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కాజులూరు

తమ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలపై దృష్టి సారించాలని బంధనపూడి సర్పంచ్ దేగల తిరుమల వేణి కోరారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్‌బికె, సచివాలయం, వెల్నెస్ సెంటర్ భవన నిర్మాణాలను ప్రారంభించిందని, అయితే నిధులు కొరత, ప్రభుత్వ మారడంతో అనేక భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని అన్నారు. కావున మధ్యలో నిలిచిపోయిన భవనాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మనస్థాపానికి గురై ఒక వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాలు ప్రకారం మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన రేలంగి సుబ్బారావు (55) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో కుమారుడు మందలించగా మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సీతానగరం గ్రామానికి చెందిన కురుకూరి అబ్బులు అతని కుమారుడు రాము జగ్గంపేట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అబ్బులు కాలుకు బలమైన గాయం కాగా, రాముకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్రావెల్ తరలిస్తున్న వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో పోలవరం పుష్కర కాలువ గట్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం తెల్లవారుజామున విఆర్ఒ దొండపాటి చంటిబాబుతో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్, లోడ్ చేస్తున్న జెసిబిని స్వాధీనం చేసుకుని, వాటి డ్రైవర్లు ఇంతిపల్లి జ్యోతిబాబు, లొండ శంకర్‌ను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. తాటిపర్తికి చెందిన స్వామి ఆధ్వర్యంలో ఈ గ్రావెల్ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భారీ కొమ్మపడి చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని స్థానిక బస్టాండ్ వెనుక విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మ పడడంతో విద్యుత్ వైర్లు తెగిపడి అక్కడే ఆడుకుంటున్న చిన్నా పాతూరి అక్షర (9)కు తగలడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. గాయపడిన మరొక చిన్నారిని దేవదాసి లిషితను హుటాహుటిన రాజమహేంద్రవరంలోని విజయసాయి హాస్పటల్లో జాయిన్ చేర్చారు. ఈ సంఘటనతో పాతపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.



పెరటు మొక్కల పెంపకంపై మాట్లాడుతున్న పాటంశెట్టి

ఊపిరి కోసం మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఊపిరి కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచాలని ప్రకృతి ప్రేమికుడు పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తన ఇంటి వద్దనే అమలు చేస్తున్న వర్మి కంపోస్ట్ విధానాలను గురువారం ఆయన పాత్రికేయులకు వివరించారు. ప్రతి మనిషి రోజుకి 20 వేల నుంచి 22 వేల సార్లు ఊపిరి తీసుకుని వదులుతామని, మనం తీసుకునే గాలిలో ప్రాణవాయువైన ఆక్సిజన్‌ని మొక్కలు ఇస్తాయని అన్నారు. మనం విడుదల చేసే కార్బన్ డయాక్సైడ్ మొక్కలు తీసుకుంటాయని తెలిపారు. మనిషి లేకపోయినా మొక్క పెరగగలదని, మొక్క లేకపోతే మానవులతోపాటు సకల జీవరాసులకు మనుగడ ఉండదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున వనమహోత్సవం పేరుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్క రోజులో కోటి మొక్కలు నాటాలని పిలుపునివ్వడం శుభపరిణామం అన్నారు. నాటిన ప్రతి మొక్క వృక్షం అయ్యేవరకు సంరక్షించే విధంగా నాటిన ప్రతి మొక్కకు ఒక కోడ్ నెంబర్ ఇచ్చే విధంగా ప్రతి మూడు నెలలకు ఆ మొక్క స్టేజ్ ఫోటోతో సహా ప్రభుత్వానికి నివేదించే విధంగా ఏర్పాటు చేసినట్లయితే వేల కోట్ల రూపాయలు ఆదాయం ప్రభుత్వం సృష్టించవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని ఆయన కోరారు.



ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం కార్యకర్తలు

మామిడికి మద్దతు ధర కల్పించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

మామిడికి మద్దతు ధర ప్రకటించాలని, మామిడి రైతులకు కోల్డ్ స్టోరేజీలు ప్రభుత్వం నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ బంగినపల్లి మామిడిపండు టన్ను రూ.40 వేల నుంచి రూ.5 వేలకు పడిపోయిందన్నారు. కల్టర్ కాయ జ్యూస్ కంపెనీకి వేస్తే టన్ను రూ.నాలుగు వేలు ఇస్తున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం మామిడి రైతును ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, దేశెట్టి సురేష్, సుంకర శ్రీనివాస్, సిగిరెడ్డి త్రిమూర్తులు, కోట వీరబాబు, మాస అన్నవరం, మాదాపు అబ్బు తదితరులు పాల్గొన్నారు.

అపోలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని అపోలో ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి ఒక మహిళ ప్రాణాన్ని కాపాడారు. సుమారు నాలుగు గంటలపాటు వైద్యులంతా శ్రమించి అన్న వాహిక నుంచి చొచ్చుకుని గుండె పెద్ద నరంలోకి చొచ్చుకున్న చేప ముల్లును తీశారు. ఈ విధంగా బహుశా జాతి స్థాయిలో ఈ తరహా కేసు రెండు మూడు కంటే ఎక్కువ ఉండవని ఆ వైద్యులు వెల్లడించారు. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్ర చికిత్స బృందం వైద్యులు వై.శివరామకృష్ణ, పి.నాగేశ్వరరావు, జి.వంశీచైతన్య వివరించారు. బిక్కవోలుకు చెందిన 54 ఏళ్ల జంపా మంగయ్యమ్మకి అన్నవాహిక ద్వారా చేప ముల్లు గుండె వద్దకు చేరిందన్నారు. ఆమెకు వివిధ పరీక్షలు నిర్వహించి చేప ముల్లు గుండె దగ్గర చొచ్చుకుని ఉండడం గమనించామన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయకుండా చాతీ ఎముకలకు నష్టం కలిగించకుండా సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకుని ఈమెకు గుండె వద్ద ఇరుక్కుని ఉన్న చేప ముల్లును తొడల దగ్గర నుంచి గొట్టం ద్వారా ట్రేవర్ ప్రొసీడర్ అనే విధానంలో చికిత్స నిర్వహించి తొలగించామని చెప్పారు. ప్రస్తుతం ఆమె కోరుకుంటున్నారని త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. కష్ట సాధ్యమైన శస్త్ర చికిత్సను నిర్వహించి మహిళ ప్రాణాలు కాపాడిన వైద్యులను అపోలో ఆసుపత్రి సిఇఒ ఆర్ఆర్ రెడ్డి అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

టిసిఎస్‌కు 485 మంది ఆదిత్య విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన 485 మంది విద్యార్థులు టిసిఎస్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సంస్థ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. గురువారం క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా టిసిఎస్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో 485 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని నాయుడు అన్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా టిసిఎస్ కంపెనీకి వందల సంఖ్యలో తమ విద్యార్థులు ఎంపిక అవుతున్నారని అన్నారు. డిగ్రీ మొదటి రోజు నుంచే అందిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ, పియర్సన్ మీ ప్రో ద్వారా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్, గ్రూప్ డిస్కషన్స్, సర్టిఫికేషన్ కోర్సుల వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఎంపికైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, ప్రిన్సిపల్స్ కె. కరుణ, డి.బ్యూలా, ఎండి.షాహిద్దీన్, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్స్ అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన ఆదిత్య విద్యార్థులు

30వ రోజుకు ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 30 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసిన భద్రరావు, వాకాడ భాస్కరరావు, ఆకుల రామకృష్ణ, అయ్యప్ప స్వామి, కె.వెంకటరమణ, ఒ.సోనియా, మహాపాతిన అరుణ్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు



చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

బాధితుని కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కరప

ముమ్మిడివరంలో ఇటీవల నీటమునిగి ప్రాణాలు కోల్పోయిన కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన తాతపూడి నితీష్‌కుమార్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.సత్యనారాయణ, కూటమి నాయకులు సుందరపల్లి సత్తిబాబు, సింగినేడి సత్తిబాబు, పి.వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపిడిఒ డి.శ్రీలలిత గురువారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. అనంతరం ఆమె చంద్రమాంపల్లి - దివిలి ఏలేరు బ్రిడ్జి వద్ద ఏలేరు కాలువలో డంపింగ్ చేసిన కూరగాయల వ్యర్థాలను పరిశీలించిన ఎంపిడిఒ డంపింగ్ చేసిన కూరగాయల మార్కెట్ వ్యాపారులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తెం వెంకట శ్రీనివాసరావు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, ఎపిఒ డి.సుధీర్, జెఇ వి.సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు గురువారం కూటమి నాయకులు స్థల పరిశీలన చేశారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో రోడ్ల పక్కనే చెత్త వెయ్యాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనిపై ఎంఎల్ఎ చినరాజప్పకు వివరించినట్లు స్థానిక నాయకులు చల్లా బుజ్జి తెలిపారు. ఈ నేపథ్యంలోనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం గ్రామంలో ఒక స్థలాన్ని గ్రామ నాయకులు పరిశీలించారు. ఎంఎల్ఎ చినరాజప్ప పరిశీలన అనంతరం కంపోస్ట్ యార్డు ఏర్పాటుకు నిర్ణయం జరగనున్నట్లు బుజ్జి తెలిపారు.

యానాం వార్తలు



మల్లాడి అభిమానులు నిర్వహిస్తున్న భారీ ర్యాలీ

మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు పురస్కరించుకుని మల్లాడి అభిమాన సంఘం, యూత్ ఆధ్వర్యంలో గురువారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యర్రా గార్డెన్స్ నుంచి ర్యాలీ నియోజకవర్గంలోని చింతా వారి వీధి, త్యాగరాయ వీధి, పాత బస్టాండ్, మెట్టకూరు, గోపాల్ నగర్, కనకాల పేట, యుకెవి నగర్, భీమ్ నగర్, కురసం పేట, ఫరంపేట, మీదుగా సావిత్రి నగర్ గిరియంపేట తిరిగి మల్లాడి స్వగృహం వద్దకు చేరుకుంది. యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని మల్లాడిపై అభిమానాన్ని చాటుకున్నారు. మల్లాడి స్వగృహం వద్ద శుక్రవారం మల్లాడి పుట్టినరోజు వేడుకలు అభిమానులు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహిళలకు, పురుషులకు, యువతి యువకులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం విజేతలకు మల్లాడి చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం యానాంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. చెట్లను పెంచడం వల్ల జనజీవనాన్ని రక్షించడానికి దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ, ఎడిపిసి కమిడి ప్రభాకర్, కామిశెట్టి వేణుగోపాల్, దాట్ల దేవదానం రాజు, సాధనాల బాబు, చింతా రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హేండీక్రాఫ్ట్ ప్రదర్శన

యానాం సమగ్ర శిక్షణ అభియాన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో స్థానిక కోనవెంకటరత్నం కాలనీకి చెందిన పత్రి ధనలక్ష్మి ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి. యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, అధికారులు, విద్యార్థులు తిలకించారు. ధనలక్ష్మిని పలువురు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి పి.స్వాతి

ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయించరాదని, ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని పిఠాపురం వ్యవసాయ శాఖ అధికారిణి పి.స్వాతి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాలకు చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాల నాణ్యత ప్రమాణాల విషయంలో నిర్దిష్ట నిబంధనకు లోనై ఉండాలని అన్నారు. ఎంఆర్‌పి ధరలకు మాత్రమే విక్రయించాలని, తొలుత విత్తనం మొలక శాతం పరీక్షించి 80 శాతం కన్నా ఎక్కువ మొలక ఉంటేనే రైతులకు అమ్మకాలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, యు.కొత్తపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారులు ఎ.అచ్యుతరావు, వి.జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుభాష్

ఆదిత్యలో కేన్సర్‌పై అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం 'డెవలప్‌మెంట్ ఆఫ్ నోవెల్ స్మాల్ మాలిక్యూల్స్ ఎస్ పొటెన్షియల్ యాంటీ టి కేన్సర్ ఎజెంట్స్' అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ సభలో న్యూజెర్సీలోని రోవాస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సుభాష్ జొన్నలగడ్డ మాట్లాడారు. కంప్యూటేషన్ కెమిస్ట్రీ, మాలిక్యులర్ డాకింగ్ వంటివి కొత్త ఔషధాన్ని అభివృద్ధి, సహజ వనరుల నుంచి తీసిన సమ్మేళనాలను ఆధారంగా చేసుకుని ఎలా పర్యావరణహితంగా ఔషధాలు రూపొందించవచ్చు అనే అంశాలకు ఈ సదస్సు దోహదం చేసిందని ఆదిత్య డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ. రమేశ్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.వానతి, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశ్ గాడిపెల్లి, ఇతర విభాగాధిపతులు డాక్టర్ పి. సతీష్, డాక్టర్ ఎన్.సెల్వమలార్, డాక్టర్ జి. చిన్నారామ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో 396 మంది ఫైలేరియా రోగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో 396 మంది ఫైలేరియా రోగులు ఉన్నారని ఫైలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.వీరబాబు తెలిపారు. గురువారం పాత మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బోధ వ్యాధి రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా బోధవ్యాధి కేసులు నమోదు కావడం లేదన్నారు. ప్రతి నెల పట్టణంలోని ఏదో ఒక ప్రాంతంలో రాత్రి సమయంలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెలలో పాశీల వారి వీధి నారాయణపురంలో 348 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా ఒక్కరికి కూడా వ్యాధి సోకినట్లు నిర్ధారణ కాలేదన్నారు.

వెన్నుపోటు విజయవంతం

ప్రజాశక్తి - కిర్లంపూడి

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమం విజయవంతం అయిందని మాజీ మంత్రి, పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్తిపాడులో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తాను ఆ కార్యక్రమంలో పాల్గొనలేకపోయినందుకు క్షమించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు, గొల్లప్రోలు, సామర్లకోట

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను తొలగించేందుకు చేపట్టే మరమ్మతుల పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజరం సబ్ స్టేషన్ పరిధి లోని కోలంక, చలివేంద్రపాడు, నామవానిపాలెం, పొలమూరు పాడు, ఉప్పుమిల్లి గ్రామా లతోపాటు, ఆక్వా, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. అలాగే గొల్లప్రోలు మండలంలో ఆర్‌డిఎస్ఎస్ పథకంలో 24 గంటల విద్యుత్ సరఫరా లైను నిర్మాణం కోసం చేబ్రోలు సబ్ స్టేషన్‌లో చేపట్టే మరమ్మతుల నిమిత్తం శుక్రవారం చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, తాటిపర్తి, చినజగ్గంపేట, చేబ్రోలు, దుర్గాడ, మల్లవరం, ఎ.విజయ నగరం గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫర ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీ కట్టింగ్, మరమ్మతుల పనుల కోసం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉండూరు, పి.వేమవరం, కాపవరం, గొంచాల, బ్రహ్మానందపురం, చంద్రంపాలెం, నవర, పవర, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.




అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపార సంస్థలు, బ్రాందీ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల యాజమానులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య వివరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా 'బయోలైట్' సంస్థ తయారు చేసిన ఉత్పత్తులు, వాటర్ బాటిల్లు, గ్లాసులు, క్యారీ బ్యాగ్లు, కూర కవర్స్, పేపర్ ప్లేట్లు, టిఫిన్ చట్నీ కవర్స్, స్ట్రాలు, బిర్యానీ బాక్సులు గురించి అవగాహన కల్పించారు. ఈ ఉత్పత్తులు భూమిలో కలిసిపోయే విధంగా తయారు చేయబడినవి కావడంతో పర్యావరణ పరిరక్షణకు సహాయపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'బయోలైట్' సంస్థ ప్రతినిధి పోడూరి వంశీ దీక్షిత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలను ప్రారంభిస్తున్న విమలాదేవి జైన్

చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలకపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో గురువారం చిత్రలేఖన పోటీలను విమలాదేవి జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 9న జరిగే సమ్మర్ క్యాంపు ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అమృత, నమ్రత, అనూష, అంజలి, జస్విత, లలిత, నాని, సాయి, బంగారం, నేహా, రేణుక పాల్గొన్నారు.